సాక్షి ప్రకాశం

బుధవారం । 9 । జూలై । 2025



చంద్రబాబు మోసాలను ఎండగడదాం

ఎన్నికల హామీలు అమలు చేయకుండా విస్మరించిన చంద్రబాబు మోసాలను ఎండగడదామని మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. - 8లో..



రాజన్నకు నీరాజనం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఓటర్ల జాబితాలో పొరపాట్లకు తావివ్వద్దు

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాల కృష్ణ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గోపాల కృష్ణ

ఒంగోలు సబర్బన్: పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడంలో బీఎల్‌ఓల బాధ్యతలు కీలమని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్ గోపాల కృష్ణ సూచించారు. మంగళవారం ఒంగోలు నగరంలోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఓటర్ జాబితా తయారీ, బీఎల్‌ఓ యాప్ నిర్వహణపై ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి బీఎల్‌ఓలకు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకుని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పిన్నిక మధుసూదన్ రావు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఫీజుల రేట్లు తెలియచేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు



డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ఆంధ్ర ప్రదేశ్ అల్లోపతి ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం -2002 రూల్ నంబర్ 9 ప్రకారం జిల్లాలోని అన్నీ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, లేబొరేటరీలలో వసూలు చేసే ఫీజుల వివరాలను ఇంగ్లిషుతో పాటు స్థానిక భాషలో రిసెప్షన్ కౌంటర్ల వద్ద రోగులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, లేబొరేటరీలలో లభ్యమయ్యే సేవల వివరాలను ఈ నెల 15వ తేదీ లోపు జిల్లా వైద్యారోగ్య శాఖ ఈ మెయిల్‌కు పంపించాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేసే నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులను మోసం చేసిన మంత్రి లోకేష్



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఒంగోలు టౌన్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మంత్రి నారా లోకేష్ విద్యార్థి లోకాన్ని మోసం చేశారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక మిరియాలపాలెం సెంటర్లోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తూ తూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకుందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ నాటికి రూ.3900 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండగా రూ.2600 కోట్లు కేటాయించిందని చెప్పారు. ఆ కేటాయింపులు కేవలం పేపర్ల మీదకు మాత్రమే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. ఇంత వరకు కనీసం ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రుపాయికి కూడా రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. దీంతో విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థుల మీద తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నాయని, విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్నా ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు తెచ్చుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఫణిరాజు, మరియబాబు, మధు, హుసేన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు చర్చి సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరి రవిబాబు



చీమకుర్తిలో అన్నదానం చేస్తున్న శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మేరుగు నాగార్జున



సింగరాయకొండలో వేడుకల దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

జన బాంధవుడికి.. మహా నివాళి!

- రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు
- ఊరూ..వాడ అన్నదానాలు
- రక్తదాన శిబిరాలు..
- వృద్ధాశ్రమాల్లో పండ్లు, దుస్తుల పంపిణీ

ఒంగోలు సిటీ:

సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రదాత, అపర భగీరథుడు ప్రజారంజక పాలనతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని జిల్లా వాసులు మనసారా స్మరించుకున్నారు. చిన్నచిన్న జీవితాలకు ఆయన చేసిన మేలును గుర్తు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాల లబ్ధిదారులు ఆయన జ్ఞాపకాలను తమ హృదయాల్లో పదిలంగా ఉంచుకున్నారు. అప్పటి వరకూ కరువు విలయతాండవం చేసిన నేలలో గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టుల ద్వారా సాగు, తాగునీటిని అందించారు. వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా భారీగా నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశారు. రైతు పక్షపాతిగా ఆయన అమలు చేసిన కార్యక్రమాలు జిల్లాలోని అన్నదాతలకు అండగా నిలిచాయి. వాటన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకుంటూ మంగళవారం ఊరువాడ వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కేక్‌లు కట్ చేశారు. మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత కంటి వైద్య శిబిరాలు, అనాథ, వృద్ధుల ఆశ్రమాల్లో పండ్లు, దుస్తుల పంపిణీ ఇలా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ఆరోగ్య ప్రదాత వైఎస్సార్

చరిత్రలో గుర్తు పెట్టుకోగలిగిన నాయకుడు, 'ఆరోగ్యశ్రీ' తో ప్రజల గుండెల్లో నిలిచిన ఆరోగ్యప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరంలను ముఖ్య అతిథులుగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావులు ముఖ్య అతిథులుగా పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 45వ డివిజన్‌లో, చర్చి సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కేక్ కటింగ్ నిర్వహించారు.



ఒంగోలులో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, బత్తుల

ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ చరిత్రలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో పేదల కోసం పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని మ్యానిఫెస్టోలో పెట్టి రైతు రుణమాఫీ చేసిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందన్నారు. 108, 104, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ప్రజలకు దగ్గర చేసిన నాయకుడు వైఎస్ రాజశేఖర రెడ్డి అన్నారు. ఇటువంటి నాయకుడిని చరిత్ర గుర్తు పెట్టుకుంటుందన్నారు. వైఎస్సార్ హయాంలో ఎమ్మెల్యేగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి నిలిచి ఉన్నారని, చిరస్మరణీయుడని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాలన్నింటినీ గత ఐదు సంవత్సరాల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. 2029 లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు.

వై.పాలెంలో..

మహానేత వైఎస్సార్ జయంతిని వైపాలెం నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహించారు. వై.పాలెంలోని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పుల్లలచెరువు, పెద్దారవీడు, పెద్దదోర్నాల, త్రిపురాంతకంలో ఆ పార్టీ నాయకులు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

వాడవాడలా సేవా కార్యక్రమాలు

దర్శి నియోజకవర్గంలో మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నేతృత్వంలో అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు జరిగాయి. దర్శి వైఎస్సార్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. శివరాజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ముండ్లమూరు మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ పాల్గొన్నారు. కురిచేడు బస్టాండ్ సెంటర్‌లో పార్టీ నాయకులు అన్నదానం, మండలం పడమర వీరాయిపాలెం లోనిశ్రీ కరుణా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. దొనకొండ పట్టణంలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొండపిలో..

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సింగరాయకొండ కందుకూరు రోడ్డు సెంటర్, బాలయోగినగర్ ఆర్చి, సుందర్‌నగర్, మూలగుంటపాడు, పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. బాలయోగినగర్‌లో దుస్తులు పంపిణీ చేశారు.

ఎస్ఎన్‌పాడులో..

వైఎస్సార్ జయంతి సందర్భంగా చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున పాల్గొని అన్నదానం చేశారు. చీమకుర్తి మండలంలోని కూనంనేనివారిపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నాయకులు స్థానిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, విద్యాసామగ్రి అందించారు.

మార్కాపురం నియోజకవర్గం..

మార్కాపురం, కొనకనమిట్ల మండలాల్లో నిర్వహించిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు పాల్గొన్నారు. మార్కాపురం పాతబస్టాండ్ సెంటర్, తూర్పు వీధిలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు జీజీహెచ్‌లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కొనకనమిట్ల, పెదారికట్ల, చినారికట్ల జంక్షన్‌లో నిర్వహించిన వేడుకల్లో అన్నా రాంబాబు పాల్గొని నివాళులర్పించారు.

గిద్దలూరు నియోజకవర్గంలో..

గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట, కంభంలలో వైఎస్సార్ జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచారు. కంభంలో పేద మహిళలకు చీరలు, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మండల పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు.

కనిగిరిలో..

కనిగిరిలో నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ ఆధ్వర్యంలో మాచవరంలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కొత్తూరు, చెక్‌పోస్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. పాతూరు యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి 60 మంది రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ఎన్నికల హామీలపై నిలదీయండి



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ .. కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, దద్దాల నారాయణ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ నేతలు



మాట్లాడుతున్న బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, పక్కన దద్దాల నారాయణ, వేదికపై వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కదిరి బాబూరావు, బన్ని, తదితరులు

కనిగిరిరూరల్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కల్లిబొల్లి మాటలతో సుపరిపాలన పేరుతో గ్రామాల్లో తిరుగుతున్న కూటమి నేతలను పార్టీ శ్రేణులు, ప్రజలు.. హామీలు ఏమయ్యాయో నిలదీయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక పవిత్ర కళ్యాణ మండపంలో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ (రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో) కు సంబంధించి క్యూర్ కోడ్ కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే గఫార్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో శివ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మోసం, వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు అని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు, మరో 143 హామీలతో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసి.. ఏడాదైనా వాటిని అమలు చేయకుండా తీవ్ర మోసం చేస్తున్నాడని విమర్శించారు. 2014, 2024 రెండు దఫాలు అబద్ధాల, మోస పూరిత హామీలతోనే చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి.. ప్రజా మన్ననలు పొందిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్ 2.0 పాలనలో ప్రతి కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. కనిగిరిలో పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు కొరవ లేదని.. పార్టీ విజయానికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు: బూచేపల్లి వెంకాయమ్మ

కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని.. అటువంటి వాటికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భయపడరని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో ఏ ఒక్క వర్గం ప్రజలూ సంతోషంగా లేరన్నారు. సుపరిపాలన పేరుతో గ్రామాల్లో తిరుగుతున్న నేతలను హామీల అమలుపై గట్టిగా ప్రశ్నించాలన్నారు. ఎవరూ ఎల్లప్పుడు శాశ్వతంగా అధికారంలో ఉండరని.. మారుతుంటాయని.. అధికార పార్టీ నాయకులు అది గమనించుకుని.. వేధింపులు మానుకుని పథకాల అమలుపై దృష్టి పెట్టాలన్నారు. బొద్దింకలు, వెంట్రుకల ఉన్న భోజనం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెడుతున్నారని మండిపడ్డారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి: దద్దాల నారాయణ యాదవ్

ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను గ్రామ గ్రామాన తిరిగి ప్రజలకు వివరించేందుకు పార్టీ నేతలు, శ్రేణులు, అంతా సమష్టిగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్‌కు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేలా పనిచేద్దామన్నారు. కనిగిరిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురేద్దామన్నారు.

పచ్చి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు: బత్తుల, కదిరి

కూటమి నేతలైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో పచ్చి అబద్ధాలు చెప్పి.. అధికారంలోకి వచ్చారని పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, విశాఖపట్నం పరిశీలకుడు, కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, డీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు సున్నం పెట్టారని విమర్శించారు. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా సుపరిపాలన పేరుతో గ్రామాల్లోకి వస్తున్న టీడీపీ నేతలను యువకులు నిరుద్యోగ భృతి, ఉపాధి, ఉద్యోగాలు ఎక్కడా అని..? మహిళలు ఉచిత బస్సు ఏదీ అని..? విద్యార్థులు తల్లులు తల్లికి వందనం బిడ్డలందరికీ ఎందుకు ఇవ్వలేదనీ..? భరోసా, బీమా ఎక్కడా అని రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు. కూటమి సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నేతలు గుంటక తిరుపతిరెడ్డి, కస్తూరిరెడ్డి, పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, చింతగుంట్ల సాల్మన్, వైఎం సరిత ప్రసాద్‌రెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, డాక్టర్ రసూల్, రహీం, సిద్దారెడ్డి, ఎస్‌కే జిలాని, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ఎస్ నరసారెడ్డి, శ్రీహరిరెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, జీ ఆదినారాయణరెడ్డి, కటికల వెంకటరత్నం, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, గట్టా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మేకల శ్రీనివాస్ యాదవ్, చప్పిడి వెంకట సుబ్బయ్య, లక్ష్మీకాంతం రెడ్డి, ఎంపీపీలు గాయం సావిత్రి, మూడమంచు వెంకటేశ్వర్లు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్‌కే చాంద్‌బాషా, యక్కంటి శ్రీను, జీ బొర్రారెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, పాలుగుల్ల మల్లి కార్జునరెడ్డి, వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, భువనగిరి వెంకటయ్య, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌కే బుజ్జీ, ఆవుల భాస్కర్, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, పోలు జయరాంరెడ్డి, మితికల గురవయ్య, సాయి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, ఎం నాగమణి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలంలో అవకతవకలు

- డిఫాల్టర్లకు భూములు కట్టబెట్టిన దేవదాయ శాఖ అధికారులు
- విషయం బయటకు పొక్కడంతో రద్దు చేసిన భూముల వేలం

టంగుటూరు: శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ భూముల కౌలు బహిరంగ వేలంలో భూములను డిఫాల్టర్లకు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా కట్టబెట్టారు. ఈ విషయం బయటకు పొక్కడంతో వేలం పాటను దేవదాయ శాఖ అధికారులు రద్దు చేశారు. వివరాలు.. మండలంలోని వల్లూరులో వేంచేసి ఉన్న వల్లూరమ్మ దేవస్థాన దత్తత సంస్థ తూర్పు నాయుడుపాలెం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానానికి సర్వే నంబర్ 34/1,2లో 28.05 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని ఐదు బిటంలుగా విభజించి ఒక్కో బిటంకు 5.61 ఎకరాలుగా విభజించారు. వీటికి సంబంధించి మంగళవారం భూములు బహిరంగ వేలం నిర్వహించారు. 1,5 బిటంలను దామచర్ల రవికుమార్ వేలంలో దకించుకున్నారు. 2,3,4 బిటంలు దామచర్ల శ్రీనివాసరావు వేలం పాటలో దక్కించుకున్నారు. ఇతని భార్య, కుటుంబ సభ్యులు గతంలో దేవస్థాన భూముల వేలం పాట పాడి డబ్బులు కట్టపోవడంతో డీఫాల్టర్లుగా ఉన్నా దేవదాయ శాఖ అధికారులు వేలం పాటలో పాల్గొనిచ్చారు. 2,3,4 బిటంలు దామచర్ల శ్రీనివాసరావుకు కట్టబెట్టడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో డిఫాల్టర్లకు భూములు కేటాయించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై వల్లూరమ్మ దేవస్థాన కార్యనిర్వహణాధికారి రమేష్‌ను వివరణ కోరగా రికార్డుల్లో దామచర్ల శ్రీనివాసరావు భార్య, బంధువులు డిఫాల్టరుగా ఉన్నారని తెలిసిందని, తప్పు జరిగిందని భావించి వేలం పాట రద్దు చేశామని, మళ్లీ చంద్రమౌళీశ్వర స్వామి భూముల కౌలు బహిరంగ వేలం తేదీ త్వరలో వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

చిన్నకంభం తూము గేట్లు మూసివేత



చిన్నకంభం తూము గేట్లు మూసేయడంతో ఆగిన నీరు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: చారిత్రాత్మక కంభం చెరువు అడుగంటి పోతున్నా ఇరిగేషన్ అధికారులు చిన్నకంభం తూము గేట్లు ఎత్తారు. చెరువులో నీటి మట్టం తగ్గిపోతున్న నేపథ్యంలో మంగళవారం సాక్షి దినపత్రికలో 'అడుగంటిన ఆశలు' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు మంగళవారం చిన్నకంభం తూము గేట్ల మూసివేశారు. దీంతో చిన్నకంభం తూము ద్వారా నీరు వెళ్లకుండా ఆగిపోయాయి.

తెలుగు తమ్ముళ్ల

బాహాబాహీ

- ఎమ్మెల్యే బీఎన్ ఎదుటే పోట్లాడుకున్న తెలుగు తమ్ముళ్లు
- సమస్యలు ఏకరువు పెట్టడంతో మరో వర్గం అభ్యంతరం
- మధ్యలోనే వెళ్లిపోయిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

టాస్క్‌ఫోర్స్: సంతనూతలపాడు నియోజవర్గంలోని తెలుగుదేశం పార్టీలో రోజూ ఏదో ఒకచోట వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. అధికారం చేపట్టి ఏడాది దాటినా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండటంతో పరిష్కారం కోసం ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకొస్తున్నారు. పార్టీలో ఓ వర్గం నాయకులు సమస్యలను ఎమ్మెల్యే ముందు ఏకరువు పెడితే మరోవర్గం నాయకులు పోట్లాటకు దిగుతున్నారు. తాజాగా మద్దిపాడు మండలం నాగన్నపాలెంలో తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా మారి బాహాబాహీకి దిగారు. మంగళవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో పండ్ల తోట వేసుకుంటున్న రైతు పొలంలో ఎమ్మెల్యే మొక్క నాటి మాట్లాడుతున్నారు. ఇంతలో టీడీపీలో ఓ వర్గానికి చెందిన వ్యక్తి తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేయలేదని.. ఎన్నిసార్లు నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకి విన్నవించారు. అలా అనడంతో టీడీపీలోని రెండో వర్గానికి చెందిన నాయకుడు ఇప్పుడు కాదు.. తర్వాత మాట్లాడుదామంటూ చెప్పాడు. అసలు తమ గ్రామ సమస్య గురించి మాట్లాడడానికి నీ అనుమతి ఏంటటూ మొదటి వర్గానికి చెందిన వ్యక్తిని ప్రశ్నించాడు. రెండో వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఎదురుగానే ఇలా పోట్లాడుకుంటుంటే మధ్యలోనే ఆయన ప్రసంగం ఆపేసి వెళ్లిపోయారు. పోలీసులు రంగప్రవేశం చేసి గ్రామంలో ఇరువర్గాలకు చెందిన వారిని చెదరగొట్టి వారిని ఇళ్లకు పంపేశారు.



చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు, పార్టీ నాయకులు



యర్రగొండపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజన్నకు నీరాజనం

ఒంగోలు: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు మంగళవారం నీరాజనం పలికారు. ఆయన జయంతి సందర్భంగా వాడవాడలా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొన్నిచోట్ల అన్నదానాలు చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఒంగోలులో రక్తదానం చేశారు. మహానేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేద ప్రజల కోసం ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మననం చేసుకున్నారు.



ఒంగోలు 45వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న చుండూరి, వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి, బత్తుల



కనిగిరిలో కేక్ కట్ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల, వైఎస్సార్ సీపీ నాయకులు



సింగరాయకొండలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



దర్శిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



కంభంలో దుస్తులు పంపిణీ చేస్తున్న గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి



మార్కాపురంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు



ఒంగోలులో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి

చంద్రబాబు మోసాలను


ఎండగడదాం..



మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, వేదికపై చుండూరు రవిబాబు, కొమ్మూరి కనకారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు

- ఎన్నికల ముందు ఓట్ల కోసం అడ్డగోలు హామీలు
- అధికారంలోకి వచ్చి ప్రజలను నిట్టనిలువునా మోసం
- బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ సమావేశం విజయవంతం
- హాజరైన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు

ఒంగోలు సిటీ: ఇంటింటికీ వెళ్లి సీఎం చంద్రబాబు మోసాలను ఎండగడదామని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అడ్డగోలు హామీలను నమ్మి ప్రజలు ఓటేశాక వాటి ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. మంగళవారం ఒంగోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేశారు, ఎన్నికల ముందు ఏ విధంగా హామీలు ఇచ్చారో, అధికారంలోకి వచ్చాక ప్రజలను ఏ విధంగా వెన్నుపోటు పొడిచారో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఒంగోలు నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించామన్నారు. చంద్రబాబు ప్రతి సెక్టార్‌ను మోసం చేశారన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ఒంగోలు నియోజకవర్గానికి చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, 108,104 వంటి సంక్షేమ పథకాలు ప్రజల్లో గుండెల్లో నిలిచిపోయాయన్నారు. ప్రజల సమస్యలతో మమేకం కావాలంటే పాదయాత్ర ఒక్కటే మార్గమని నమ్మి పాదయాత్రతో పేద ప్రజల గుండె చప్పుడును పసిగట్టిన దార్శనీకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి..అని కొనియాడారు. ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు సుపరిపాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు జీవితకాలం మోసంతో నిండిపోయిందన్నారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని చెప్పారు. ఇందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టాలన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా ప్రజలకు ఇచ్చిన హామీలను సైతం విస్మరించారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, రిటైర్డు ఉద్యోగ సంఘాల నాయకులు బండి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సీఎం వెంకటేశ్వరరెడ్డి, పాలడుగు రాజీవ్, పల్నాటి రవీందరరెడ్డి, ఆళ్ల రవీంద్రారెడ్డి, భూమిరెడ్డి రమణమ్మ, పేరం ప్రసన్న, వాణి, మేరీకుమారి, కేవీ ప్రసాద్, మీరావలి, శ్యాంసాగర్, రషీదాబేగం, రాంబాబు, ఉన్నం జనార్దన్, రాయపాటి అంకయ్య పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి మేరుగు, చుండూరు రవిబాబు, కొమ్మూరి కనకారావు